మిథ్యా విలువలు

—చిల్లర భవానీదేవి

ఏదో చెప్పాలన్నట్లుగా వచ్చి తటపటాయిస్తూ నిలబడిపోయింది మమత.

టేబుల్‌ముందు కూర్చుని దీక్షగా ఏదో రాసుకుంటున్న దమయంతి తలెత్తి కూతురి కేసి ప్రశ్నార్థకంగా చూసింది.

'మమ్మీ... మరే...' నసిగింది మమత.

కూతురికేసి పరీక్షగా చూసింది దమయంతి. లోకజ్ఞానం తెలీనట్లుగా అమాయకంగా ఉంది మమత మొహం.

ఆపేక్షగా చేయిచాపి, కూతురి చేతిని తన చేతిలోకి తీసుకొని పక్క కుర్చీలో కూర్చోబెట్టుకుంది.

"చెప్పమ్మా... ఏం... కావాలి."

"ఏంలేదు మమ్మీ! నేను పి.జి చేయను. డిగ్రీతోటే ఆపేస్తాను."

దమయంతి నుదురు చిరాగ్గా ముడివడింది.

"ఎందుకని..." తీక్షణంగా అడిగింది.

మమత చేతి వేళ్ళకున్న నెయిల్ పాలిష్‌ను శ్రద్ధగా చూసుకుంటున్నది. కానీ మాట్లాడటానికి జంకుతున్నట్లుగా ఆమె చేతులు కంపిస్తున్నాయి.

"చెప్పమ్మా... ఎందుకు చదవవు..." అనునయంగా కూతురు చుబుకం పట్టుకొని తల కొంచం పైకి ఎత్తి అడిగింది దమయంతి.

"అదే... మోహన్... పి.జి. చేయడుట" మమత గొంతులో జంకు భయం మిళితమై విన్పిస్తున్నాయి.

"అతను చదువాపితే... నువ్వూ అంతేనా." రెట్టించింది దమయంతి కూతుర్ని.

"అతని కంటె ఎక్కువ చదివితే... మా పెళ్ళి... జరగదు మమ్మీ..." నసిగింది మమత.

"ఓహో... తనకంటె ఎక్కువ చదివిన అమ్మాయిని చేసుకోటానికి మోహన్‌కి అభ్యంతరమన్నమాట... అటువంటి సంకుచితుడ్ని నువ్వు చేసుకోకపోవటమే మంచిది... పోయి ఆ అప్లికేషన్ ఫిలప్ చేసి నాకివ్వు" ఆజ్ఞాపించినట్లుగా అంటున్న తల్లి మాటలకు అయిష్టంగా అక్కడ్నుంచి కదిలింది మమత.

అలా మరబొమ్మలా నిరాసక్తంగా కదిలివెళుతున్న మమతను చూస్తుంటే దమయంతి హృదయంలో దాగిన వేదనా తరంగం పైకెగసినట్లయింది.

లోపం ఎక్కడుంది... తన పెంపకంలోనా... ప్రత్యేక వ్యక్తిత్వం గల తన దగ్గర పెరిగిన మమత ఇలా మర బొమ్మలా ఎందుకు మారిపోయింది. అడుగడుగునా మమత గురించి తాను ఎంత శ్రద్ధ తీసుకుంది!... అయినా తనకన్న మోహన్ ఆమెపై అంత ప్రభావాన్ని ఎలా చూపించగలిగాడు...

దమయంతికి మోహన్ మీద పట్టరాని కోపం వచ్చేసింది. అతను తన నుండి మమతను దూరం చేస్తున్నాడన్న భావన ఆమె హృదయాన్ని వికలం చేస్తోంది. మమతను మోహన్ నుంచి వేరుచేస్తే కూతురు మానసికంగా తనకు దూరం అవుతుంది వేదనతో... నిట్టూర్చింది దమయంతి.

ఎన్నడో మర్చిపోయాననుకున్న కన్నీరు ఆప్యాయంగా కన్పించి పలకరించింది.

'రాజా....' అని మనస్సు విల విల్లాడింది జ్ఞాపకాలతో

మమత ఈనాడు ఆలోచించి నంత మాత్రంగానైనా తను ఆ రోజు ఆలోచించి ఉంటే ఈనాడింత ఒంటరి తనం అనుభవించవలసిన అవసరం వచ్చేదా... భారంగా వెనక్కివాలి కళ్ళు మూసుకుంది. కనురెప్పల మాటున దృశ్యాలు అలల్లా కదుల్తున్నాయి.

"నాన్నా... నాకు ర్యాంకు వచ్చింది. మెడిసిన్‌లో చేరతాను" దమయంతి పేపరు పట్టుకొని ఆనందంతో ఊగిపోతోంది.

"మంచిది బేబీ... కానీ..." ఆప్యాయంగా కూతురి తల నిమురుతూ ఆలోచనలో పడిపోయారు మూర్తిగారు.

"ఎందుకు నాన్నా అంత ఆలోచనా... నాకు మెడిసిన్‌లో సీటొస్తే నీకు సంతోషంగా లేదా..." గారాలు పోయింది

"లేదమ్మా! అదికాదు..." ఏదో చెప్పబోయి అర్థోక్తిలో ఆగిపోయిన తండ్రిని చూస్తూ.

'ఇంకేం చెప్పకంటి... నేను మెడిసిన్‌లో చేరుతున్నానోచ్...' అంటూ తూనీగలా కలల రెక్కలు తగిలించుకొని పరిగెత్తిన కూతురి మనస్సును ఆ తండ్రి నొప్పించలేక పోయాడు.

తెలివితేటలు, మనస్థైర్యం గల కూతురి నిర్ణయం తప్పో ఒప్పో తేల్చగల శక్తి ఆయనలో లేనప్పుడు, కూతురి కళ్ళల్లో కన్పించే భవిష్యత్తు గురించిన బంగారు కలలను చెరిపేసేందుకు అశక్తుడయ్యాడు.

"ఏంటన్నయ్యా! దమయంతిని మెడిసిన్ చేయిస్తావా..."

అనసూయ ఉండబట్టలేక అడిగేసింది.

"అవును అనూ! దానికి గట్టిగా మెడిసిన్ చేయాలని ఉంది. పైగా సీటుకూడా వచ్చింది గదా..."

"అదేంటన్నయ్యా... తల్లిలేని పిల్ల... ఈ చేతుల మీదుగా దాన్ని పెంచి పెద్ద చేశాను. కూతురైనా కోడలైనా నాకదే గదా... అందుకే ఇలా అడుగుతున్నాను..."

'అమ్మా మనం అనుకున్నవాటికి పిల్లల భవిష్యత్తు ఎందుకు కాలరాయాలి... అది చదువు కుంటానంటోంది... సీటు వచ్చింది. నేనెలా ఆపను చెప్పు."

"నిజమే అన్నయ్యా! అదింకా చిన్న పిల్ల... జీవితం తెలీదు దానికి... రాజాకి చదువు అంతగా అబ్బడం లేదని నీకూ తెల్సు... వాడి చేత ఏదైనా బిజినెస్ పెట్టించి ఆ మూడు ముళ్ళూ వేయించేస్తే..."

చెల్లెలి గుబులు అర్థమయినట్లుగా నవ్వారు మూర్తిగారు.

"మన చేతిలో ఏముందమ్మా! కానీయ్ చూద్దాం! అంతగా వాళ్ళిద్దరూ కావాలనుకుంటే మనం ఆపుతామా... పిల్లముచ్చటపడుతోంది. చేరనీ ముందు. పెళ్ళిళ్ళు రాసిపెట్టినదాన్ని బట్టి ఆపినా ఆగవు" వేదాంత ధోరణిలో అంటున్న అన్నగారి మాటలకు బదులీయలేకపోయింది అనసూయ.

అలా మెడిసిన్‌లో చేరిన దమయంతి చదువు ఎమ్.ఎస్. అవటమేగాక ఫారిన్ వెళ్ళి రావటంవరకూ కొనసాగుతూనే ఉంది. తన చదువే ధ్యాసగా ఉన్న దమయంతి చుట్టూ ఉన్న వ్యక్తుల్లోని మార్పులు గుర్తించే స్థితిలో లేదు. ఆమె అధిరోహిస్తున్న విజయశిఖరాల నుండి క్రిందకు చూస్తే నేల కన్పించనంత ఎత్తులో ఉందిప్పుడు: తనను హృదయ పూర్వకంగా కోరుకున్న వ్యక్తులు తన నుండి ఎంత దూరమయ్యారో గుర్తించేసరికి చాలా ఆలస్యమయింది.

చిన్నప్పటి ఆప్యాయత, గిల్లికజ్జాలు, ప్రేమాభిమానాలు, కోర్కెల నందనాలు, వాగ్దానాలు అన్నీ పుస్తకాల దొంతర్ల క్రింద పడి దుమ్ము కొట్టుకొని నలిగిపోయాయి.

పెళ్ళి చేసుకుంటున్నానని రాజా శుభలేఖ ఇవ్వటానికి వస్తే తండ్రి మొహంలో సుళ్ళు తిరిగిన వేదన దమయంతి గుండెలను తాకింది.

"మంచిది నాయనా... నాకెటూ ఆ అదృష్టం లేదు..."

ఆ కంఠస్వరంలో తనవారు పరాయివారయిపోతున్న వ్యధ ధ్వనిస్తోంది.

"పెళ్ళికి వస్తావు కదూ..." దీనంగా అడుగుతున్న రాజాకేసి చూడలేక అపరాధిలా తలదించుకుంది దమయంతి.

అంతరాంతరాలలో అతని పట్ల ఎగిసిపడే అనురాగ వీచికలను అదిమిపట్టి ఇక అతన్ని గురించిన ఆలోచనలకు ఆనకట్ట వేయాలనుకుంది.

"జీవితంలో పెళ్ళే పరమావధి కాదు... సాధించవలసినవి ఎన్నో ఉన్నాయి..." మనసును దిట్ట పరచుకొని కర్తవ్యపథంలోకి దృష్టిని సారించింది స్థిరంగా.

అయినా రాజా గురించిన స్మృతులు ఆమెను నీడలావెన్నాడుతూనే ఉన్నాయి. ఎందుకు తను రాజాని మర్చిపోలేకపోతోంది. ఇంత చదివింది. ఇంత సాధించింది. తను తల్చుకుంటే రాజాని మించిన వ్యక్తి భర్తగా లభించడా... ఆ ఆలోచనే ఆమెకు నచ్చలేదు. రాజా జ్ఞాపకాలు అతను పెళ్ళి చేసుకున్నాక ఎక్కువవటం ఆమెకు మరింత బాధాకరంగా వుంది. ఆ జ్ఞాపకాలు వెన్నంటుతూంటే వాటి నుంచి దూరంగా పారిపోవాలని బిజీగా ఉండటం కావాలని అలవాటు చేసుకుంది.

రాజా స్థానంలో మరో వ్యక్తిని కలలో కూడా డా.దమయంతి ఊహించలేకపోతోంది. తనకు తెలీకుండానే చిన్నతనం నుంచీ తన వయసుతోపే అతని పట్ల ప్రేమ ఊడలు చాచి పెరిగితే తాను ఎందుకు గుర్తించలేకపోయానని పరితపిస్తోందో సారి... అతనికి లేని బాధ తనకెందు కుండాలని మరోసారి మనసులోనే అతనిపై కోపం పెంచుకుంటోంది.

టమోటాలు మెత్తబడితే - చెత్త కుండీలో వేయవద్దు. రసం బాగాపిండి తలకు పట్టించుకుని పదిహేను నిమిషాల పాటు ఉంచి, ఆ తరవాత స్నానం చేయండి. వెంట్రుకలకు మృదుత్వం, కళ్లకు మంచి చలవ వస్తుంది.

తండ్రిపోయాక నిజంగా ఒంటరిదయింది దమయంతి. తన గురించిన దిగులు తోపే అది వ్యక్తం చేయకుండానే ఆయన కన్ను మూశారని కూడా ఆమెకు తెలుసు. అయినా తానుగా ఏమీ నిర్ణయించుకోలేని నిస్సహాయత, అసంతృప్తి ఆమెను వెన్నాడుతోంది. సమర్థురాలయిన సర్జన్‌గా పేరు తెచ్చుకుంది. పని ఎక్కువగా కావాలని కల్పించుకుంటుంది... శ్రమిస్తున్నది.

"ఎందుకింత కష్టపడతావు... ఇంకా సంపాదించి ఏం చేయాలని" చనువుగా కోప్పడ్డ రాజా మాటకి నవ్వేసింది జవాబుగా.

"డబ్బు కోసమనుకుంటున్నావా..." ఎదురు ప్రశ్న వేసింది సూటిగా.

రాజా అర్థమయినట్లు నిశ్శబ్దంగా చూపు మరల్చుకున్నాడు.

"దమయంతీ! ఆ సురేష్‌కి నువ్వంటే ప్రత్యేక యిష్టమట కదా!" అనసూయ అడిగింది గభాలున.

ఉలిక్కిపడింది దమయంతి.

"నా పెళ్ళి చేయాలని ఎంతాశ అత్తా! అయినా నా పెళ్ళి అయిందిగా."

ఆశ్చర్యంగా చూసింది అనసూయ మేనకోడలికేసి.

"అదే చదువుతో" నవ్వింది చిన్నగా.

"అలా తీసేస్తే ఎలా చెప్పు. నువ్వు బాగా చదువుకున్నావు. నీకు తెలీకనా... నేను మాత్రం శాశ్వతమా చెప్పు."

"నేను మాత్రం..." ఆపై పూర్తి చేయకుండా కన్నీటిని ఆపుకుంటూ వెళ్ళిపోయిన దమయంతిని చూసి అనసూయ మనసు విలవిల్లాడింది.

ఆపరేషన్ థియేటర్స్, పేషంట్సు ,సిస్టర్స్ సాంగత్యంలోనే దమయంతి శిరోజాలు కొంత రంగుమారినాయి.

తనను చూడవచ్చిన రాజాతో.

'నాతో ఒకసారి బయటికి వస్తావా?'

'ఎక్కడికి?' ఆశ్చర్యంగా అడిగాడు.

'అనాధ సదనానికి'

'ఎందుకక్కడికి'

దమయంతి నిర్ణయం విని బాధపడినా అభినందించకుండా ఉండలేకపోయాడు.

పురిటికందుగా మమతను అనాథ శరణాలయం నుండి తెచ్చుకుంది దమయంతి. ఎదురుగా ఎవ్వరూ ఏమీ అనకపోయినా చాటున గుసగుసలాడే వాళ్ళు. దమయంతి కోరిక మీద అనసూయ చేతుల్లోనే మమత పెరుగుతోంది. రాజా అత్తవారి ఊర్లోనే బిజినెస్‌లో స్థిరపడ్డాడు.

మమతకి పదో ఏట అనసూయ అందరి నుండి కన్నీటితో శాశ్వతంగా వీడ్కోలు తీసుకుంది. తన మనసెరిగిన మరో ప్రాణప్రదమైన వ్యక్తిని కోల్పోయినట్లు విలపించింది దమయంతి. అంత పెద్ద డాక్టరు అలా కుంగిపోవటం అంతా విడ్డూరంగా చెప్పుకున్నారు.

చరిత్ర పునరావృతమయినట్లు తనకి ఎదురయిన ప్రశ్నే మమతకీ ఎదురయిందీనాడు. తాను చదువుల సరస్వతి అయినా మనసు కోరిన తోడును పొందలేకపోయింది. మమత హయ్యర్ స్టడీస్ చేస్తే మోహన్ కూడా... రాజాలా... తనకంటే ఎక్కువ చదివిన స్త్రీని మోహన్ కూడా భార్యగా అంగీకరించలేడా... ప్రేమ త్యాగాన్ని కోరుతుందంటారు... ఆమె తనకి కావాలనే బలమైన నిర్ణయం తీసుకోలేని ప్రేమ నిజమైనదేనా... తరాలు మారుతున్నా సమాజం స్త్రీ, చదువును కూడా ఆమె పెళ్ళి ద్వారా శాసిస్తోందా! తనకంటే విద్యాధికురాలయితే పురుషునికి న్యూనత...! ఒక స్త్రీ విద్యావతి అయితే కుటుంబమంతా విద్యావంతమవుతుందేనే శ్రీ వివేకానందుని సూక్తి నీటి మూటేనా మరి...

సంఘం తయారు చేసిన ఈ మిథ్యావిలువలు మమతకి ఎలా అర్థమవుతాయి. భార్యా భర్తల మధ్య ఏర్పడవలసిన అవగాహన ఇది... ఇందులో సంఘ ప్రమేయం ఉండరాదు. దురహంకారంతో కూడిన సంఘం పెత్తనం మన జీవితం మీద

ఎందుకుండాలి...?

సాయంత్రం కబురంపితే మోహన్ వచ్చాడు.

'ఏంటి ఆంటీ.'

'నువ్వు పి.జి.కి అప్లై చేశావా...'

'లేదు ఆంటీ... నా చదువు అమ్మా నాన్న కింక భారం చేయదల్చుకోలేదు... నేను ఉద్యోగం చూసుకుంటున్నాను.'

'మమతా నువ్వూ ప్రేమించుకుంటున్నారు కదా! మరి మమత ఇంకా చదువుకుంటే నీకేమైనా అభ్యంతరమా" సూటిగా అడిగేసింది

"నాకా..." నవ్వేశాడు తమాషాగా.

"నువ్వలాటకాదు... నీ భార్య నీకంటే ఎక్కువగా చదివిందనే న్యూనతాభావం నీయింటిని నరకం చేస్తుంది. మమత తెలివైనది.నాకు చదివించే శక్తి ఉంది. నీకు అభ్యంతరం ఉండవచ్చని తను చదవనంటోంది" ఫిర్యాదు చేసింది చిన్నపిల్లలా.

"ఆంటీ... నేనే ఈ విషయం బాగా ఆలోచించాను. మమత నా కోసం చదువును త్యాగం చేస్తోంది... అంతటి ప్రేమమయిని సమాజం సృష్టించిన మిథ్యా విలువల కోసం వదులు కునేంత మూర్ఖుడ్ని కాను. మమతను చదివించండి. నాకు ఉద్యోగం రాగానే మేము పెళ్ళి చేసుకుంటాం మీ ఆశీస్సులతో" అంటున్న మోహన్‌ని అభినందనగా చూసింది దమయంతి.

దేశ ప్రగతిలో భాగస్వామిని అయిన స్త్రీ వ్యక్తిత్వాన్ని తెలివి తేటలనీ. మిథ్యా విలువల కోసం బలి పెట్టకూడదు. ఆమెకున్న సామర్థ్యంతో ఎదిగేవిధంగా సమాజం తోడ్పడాలి. ఆమె అన్నింటిలోనూ తనకన్న తక్కువగాఉండాలి అనే పురుషాహంకారం సమసిపోవాలి. దీనికి యువతరం ఆదర్శంగా నిలవాలి. తాము పురుషుల కన్న తక్కువగా ఉండాలనే ఆత్మన్యూనత యువతుల వ్యక్తిత్వానికి గొడ్డలి పెట్టులాంటిది.

"ఏంటి ఆంటీ... అంత ఆలోచన... ఇంతకీ మమత ఏదీ..."

"గార్డెన్‌లో ఉంది,చూడు మోహన్... నీ అభిప్రాయం చెపితే ఆనందిస్తుంది పిచ్చిపిల్ల... బలవంతంగా చదివిస్తున్నానని నాపై గొంతుదాకా కోపం పెంచుకుంది." హాయిగా అంది.

"మీలాంటి తల్లి దొరకటం మమత అదృష్టం ఆంటీ... నేను మమతకి నచ్చ చెబుతాను. థాంక్స్ ఆంటీ..." అంటూ నూతనోత్సాహంతో అడుగులు వేస్తున్న మోహన్ కేసి ప్రశంసాపూర్వకంగా చూస్తూండి పోయింది దమయంతి.

అశక్తంగా, అసంతృప్తిగా తన జీవితంలోంచి తప్పుకున్న తన 'రాజా' రూపం అంతరాంతరాలలో కన్నీళ్ళతో తృప్తిగా నవ్వినట్లనిపించింది దమయంతికి. స్వార్థంతో కొందరు వ్యక్తులు సృష్టించిన మిథ్యావిలువలపై విజయాన్ని సాధించిన అనుభూతికి లోనయిందామె. పిల్లగాలి ఆమెను అభినందిస్తున్న ట్లుగా చల్లగా తాకి వెళ్ళిపోయింది.■

మహిళల పాలిటి వరప్రసాదం

ఉద్యోగినుల సమాఖ్య

మహిళలకు ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో మద్రాసుకు చెందిన సంఘ సంస్కర్త శ్రీమతి జయా అరుణా చలం 1961లో నరసాపురం పట్టణం వర్కింగ్ ఉమన్స్ ఫోరం (ఉద్యోగినుల సమాఖ్య) స్థాపించారు.

సుమారు 12,200 మంది స్త్రీ సభ్యులతో 60 మంది సిబ్బందితో భీమవరం, మల్కాపురం పట్టణాలలో మరో రెండు శాఖలు నెలకొల్పారు.

ప్రారంభించిన అనతి కాలంలోనే నరసాపురం పట్టణశాఖ ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించు



కొంది. మహిళలచే లేసు తయారు చేయించి, వాటిని మద్రాసు ప్రధాన కార్యాలయానికి తరలించి అక్కడినుంచి విదేశాలకు ఎగుమతి చేస్తూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సుమారు 2 వేలమంది మహిళలకు పరోక్షంగా భృతి కల్పిస్తున్నారు.

పూర్వకాలంలో అంటే ఈ సంఘం స్థాపించక ముందు రీలుకి 4 రూ.లు మజూరి యిచ్చి లేసు అల్లించేవారు. అమాయకులైన స్త్రీలు దళారీల ద్వారా మోసపోయేవారు. ఈ సంఘం ఏర్పడిన తరువాత రీలుకి 25 రూ.ల దాకా మజూరి ఇచ్చి వారిని ఆదుకొంటున్నారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా ట్రైసెం పోగ్రాం కింద ఇప్పటివరకూ 80మందికి లేసు అల్లికల్లో శిక్షణ ఇవ్వటం జరిగిందన్నారు. సంస్థ వైస్ ప్రెసిడెంటు శ్రీమతి జి.రమాపతి.

శ్రీకాకుళం, విజయనగరంకి చెందిన 20 మంది గ్రామసేవికలు ఇందులో శిక్షణ పొందారు.

స్త్రీల సహకార సంఘం

మధ్యతరగతి స్త్రీలకు ఆర్థిక సౌకర్యం కల్పించటానికి అవసరమైన దారం కొనుగోలు చేసుకోవటానికి అనుగుణంగా ఇందులోనే ఒక సహకార సంఘం మహిళలచే నడుపుతూ ఇంతవరకు 12 లక్షల రూపాయలను అప్పు రూపంగా ఆర్థిక సహాయంగా అందించారు.

మహిళలకు లేసు అల్లికలో శిక్షకులుగా బి.రాజ్యలక్ష్మి, జి.రమాపతిలు వ్యవహరిస్తున్నారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కుముద్ బెన్ జోషి ఈ కేంద్రం సందర్శించి దీని పని తీరును ప్రశంసించారు.

- ఎల్. వెంకటరత్నం